# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

September - 2000

## రేడియో శ్రీలంక ద్వారా క్రీస్తు సంఘముల సువార్త ప్రసార కార్యక్రమములు

తెలుగు : **సత్యవాణి**
ప్రతి ఆది, మంగళ, బుధ, గురువారాల్లో
మధ్యాహ్నం 2-00 గం॥ల నుండి 2-15 వరకు.
ప్రసంగీకులు : **జాషువా గూటం**, కాకినాడ.

హిందీ : **సత్య సుసమాచార్**
ప్రతి ఆదివారం రాత్రి 8-45 నుండి 9-00 వరకు
ప్రతి గురువారం రాత్రి 9-00 నుండి 9-15 వరకు
ప్రసంగీకులు : **సన్నీడేవిడ్**, న్యూఢిల్లీ.

తమిళం : **సత్యవాజ**
ప్రతి ఆదివారం సాయంత్రం 6-45 నుండి 7-00 వరకు.
మంగళవారం, శుక్రవారం సాయంత్రం 5-30 నుండి 5-45 వరకు, గురువారం సాయంత్రం 5-45 నుండి 6-00 వరకు
ప్రసంగీకులు : **పి.ఆర్. స్వామి**, బెంగుళూరు.

మళయాళం : **ది వోయిస్ ఆఫ్ ట్రూత్**
ప్రతి శుక్రవారం సాయంత్రం 3-45 నుండి 4-00 వరకు
ప్రసంగీకులు : **పి.కె. వర్గీస్**, తిరువనంతపురం.

కన్నడ : **The Voice of Truth**
ప్రతి ఆదివారం మధ్యాహ్నం 1-45 నుండి 2-00 వరకు
ప్రసంగీకులు : **రోబర్ట్ రత్నాకర్**, బెంగుళూరు.

కన్నడ : **The Voice of Truth**
ప్రతి శుక్రవారం సాయంత్రం 7-45నుండి 8-00 వరకు
ప్రసంగీకులు : **జె.సి. ఛోట్**, అమెరికా.

T.V. తమిళం : ప్రతి మంగళవారం ఉదయం 7-00 నుండి 7-30 వరకు
విజయ T.V. ద్వారా ప్రసంగీకులు : **పీటర్ సాల్మన్**, మద్రాసు.

**పై కార్యక్రమములను అందరు వినండి. అందరికీ విన్పించండి.**

ఉచిత బేసిక్ బైబిల్ కోర్సులోని పాఠముల కొరకు ఈరోజే మాకు వ్రాయండి.

**SATYA VAKKU**
P.O. Box 80, Kakinada - 533 001. Phone : 0884 - 363722

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

**P.O. Box 80, Kakinada, A.P. 533 001**

**Phone : 0884 - 363722**

**Editor :**

**JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 21 సెప్టెంబరు 2000 సంచిక 2


## బైబిలును ఎందుకు చదవాలి?-1

( Why Study the Bible ? )

"శ్రేష్టమైన ప్రతి యీవియు సంపూర్ణమైన ప్రతి వరమున పరసంబంధ మైనదై జ్యోతిర్మయుడగు తండ్రి యొద్దనుండి వచ్చును; ఆయన యందు ఏ చంచలత్వమైనను గమనాగమనముల వలన కలుగు ఏఛాయయైనను లేదు" అని భక్తుడైన యాకోబు వ్రాసాడు (యాకోబు 1:17). శ్రేష్టమైన ప్రతి యీవి వెలుగుకు తండ్రియైన దేవుని నుండి కలుగుతాదని ఇక్కడ యాకోబు చెప్పాడు. దేవుడు మనలను అనేక విధములగా దీవించుచునే యున్నాడు. ఆయన యిచ్చిన వరము లన్నిటి కంటే బైబిలు గ్రంధము శ్రేష్టమైనది. దానిని మనం చదవాలి.

యెహోవా దేవుడు మానవునికి పలువిధములుగా తన్నుతాను బయలు పరచుకొని యున్నాడు. ప్రకృతిని పరిశీలించుట ద్వారా ఆయన యున్నాడని మనం గమనించగలము. "ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి. అంతరిక్షము

ఆయన చేతి పనిని ప్రచురపరచుచున్నది" (కీర్తన 19:1). నిజానికి "ఆయన అదృశ్యలక్షణములు, అనగా ఆయన నిత్యశక్తియు దేవత్వమును జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుట వలన తేటపడుచున్నవి" (రోమా 1:20). అంతేకాదు దేవుడున్నాడని మన మనస్సాక్షియే మనకు తెలియ చేయుచున్నది. దేవుడు మానవులను చేసినపుడు వారిలో తన ఆత్మను ఉంచినాడు. మనము దానిని అంతరాత్మయని, మనస్సాక్షి యని అంటాము. ఈ మనస్సాక్షి మన పనులను, తలంపులను ఆమోదించడంగాని లేక ఖండించడంగాని జరుగుతూ యుంటాది. అంటే మన తలంపులకు, క్రియలకు ప్రతినిత్యం దేవునికి జవాబు దారీగా మవ మనస్సాక్షియే యున్నది. అందువలన "ధర్మశాస్త్రము లేని అన్యజనులు స్వాభావికముగా ధర్మశాస్త్రసంబంధమైన క్రియలను చేసినయెడల తమకుతామే ధర్మశాస్త్రమైనట్టున్నారు. అట్టి వారి మనస్సాక్షి కూడా సాక్ష్యమిచ్చుచుండగను, వారి తలంపులు ఒకదాని మీద ఒకటి తప్పుమోపుచు లేక తప్పులేదని చెప్పుచుండగను, ధర్మశాస్త్రసారము తమ హృదయములందు వ్రాయబడినట్లు చెప్పుచున్నారు" (రోమా 2:14-15). మానవుని మనస్సాక్షి ద్వారా దేవుడు తన ఉనికిని ప్రచురము చేయుచున్నాడు.

అయితే దేవుడు తన కుమారుడైన యేసుక్రీస్తు ద్వారా మరింత వ్యక్తిగతముగా, నేరుగా తన్నుతాను బయలుపరచుకొనియున్నాడు. "ఎవడును ఎప్పుడైనను దేవుని చూడలేదు; తండ్రి రొమ్ముననున్న అద్వితీయ కుమారుడే ఆయనను బయలుపరచెను" (యోహాను 1:18). అందుకే యేసుప్రభువు "నన్ను చూచినవాడు తండ్రిని చూచియున్నాడని" చెప్పెను (యోహాను 14:9). చివరిగా, యోహోవా దేవుడు తన వాక్యమైన బైబిలు గ్రంధము ద్వారా బయలుపరచుకొని యున్నారు. అందువలన దేవుని చిత్తాన్ని ఈనాడు మనం తెలిసికోవాలంటే బైబిలును చదువుట అత్యవసరం. అనేకుల గృహాల్లో నేడు బైబిలు ఉన్నది గాని వారు దానిని చదువరు. అయితే "ఈ ప్రవచన వాక్యములు చదువువాడును,

వాటిని విని యిందులో వ్రాయబడిన సంగతులను గైకొనువారును ధన్యులు" (ప్రక 1:3). అందువలన "నేను వచ్చువరకు చదువుట యందును, హెచ్చరించుట యందును, బోధించుట యందును జాగ్రత్తగా ఉండుము" అని అపొ. పౌలు తిమోతిని హెచ్చరించాడు (1తిమోతి 4:13).

బైబిలు పరిశుద్ధ దేవుని గ్రంధం. దాన్ని మనం చదవాలి. భక్తిపూర్వకంగా చదవాలి. నేడు ప్రపంచంలో ఎక్కువ పఠించబడుచున్న గ్రంధమది. దాని చరిత్రను గూర్చి, వర్తమానమును గూర్చి జ్ఞానము గలవారు ప్రతినిత్యం పరిశోధించుచునే యున్నారు. ఎన్ని మారులు ఆ గ్రంధమును చదివినను అది ప్రతిసారి క్రొత్తగనే యుండును. దేశ దేశాలలో యున్న జనాంగములన్నియు బైబిలు పఠనములో ఆసక్తిని కలిగియున్నారు. అది మానవులకు దేవుడిచ్చిన గ్రంధం. అందుకే "యెహోవా గ్రంధమును పరిశీలించి చదువుకొనుడి" యనే హెచ్చరిక ఈయబడింది (యెషయా 34:16).

విశ్వవ్యాప్తమైన సూత్రములలో కారణ కార్యముల సూత్రమును మనందరం ఎరిగియే యున్నాము. It is the law of Cause and Effect. అంటే ప్రతీ కార్యానికీ సమతుల్యమైన కారణం ఉంటాదని ఈ సూత్రం యొక్క భావం. బైబిలు విషయంలో ఈ సూత్రాన్ని పాటించుదాం. బైబిలు ఒక కార్యం (It is an effect). అది ఇక్కడ వున్నది. దానికి ఎవరో ఒకరు కారకులు. ఆ కారకులు మానవులైనా అయ్యుండాలి. లేదా దేవుడైనా అయ్యుండాలి. అయితే వీరిద్దరిలో దానికి కారకులెవరో ఎట్లు నిర్ణయించగలం ? బైబిలు గ్రంధాన్ని క్షుణ్ణంగా పరిశీలించుట ద్వారా తెలిసికోగలం. అది దేవుని నుండి కలిగినదో లేదో తెలిసికోగలం. అది దైవ గ్రంధమైతే దానిలో యేమి కనుగొనగలం ? ఈ అంశాన్ని ఇప్పుడు పరిశీలించుదాం:

మొదటిగా, దేవుడే మానవులకు బైబిలును ఇచ్చిన యెడల దాన్ని ఆయన మనకు చెప్పియుండాలి. నిజానికి ఆయన ఆ పని చేసేసారు. బైబిలును

లిఖించుటలో ఆయన 40 మంది లేఖకులను 1600 సంవత్సరముల పాటు వినియోగించారు. అయితే పాత నిబంధనలోనే 3800 సార్లు అది దేవుని నుండి కలిగినదని బైబిలు తనను గూర్చి ఆరోపించుకొనుచున్నది. ఉదాహరణకు, "యెహోవా మాటలాడుచున్నాడు, ఆకాశమా ఆలకించుము, భూమీ చెవి యొగ్గుము" అని చెప్పుచు ప్రవక్తయైన యెషయా తన గ్రంధమును ఆరంభించెను (యెషయా 1:2). మోషే వ్రాసిన వ్రాతలన్నియు దేవుడు అతనికి వివరించి చెప్పెనని అతడు వ్రాసాడు (నిర్గమ 20:1). లేవీయ కాండములో 27 అధ్యాయములున్నవి. అయితే కనీసం 20 అధ్యాయములు "మరియు యెహోవా మోషేకు ఈలాగు సెలవిచ్చెను" అను మాటలతో ఆరంభమవుతాయి.

"యెహోవా ఆత్మ నా ద్వారా పలుకుచున్నాడు. ఆయన వాక్కు నా నోట ఉన్నదని" దావీదు చెప్పెను (2సమూయేలు 23:2). "యెహోవా వాక్కు నాకు ప్రత్యక్షమాయెనని" యిర్మియా వ్రాసాడు (యిర్మియా 1:4). "యేసుక్రీస్తు తన దాసులకు కనపరచుటకు దేవుడనుగ్రహించిన ప్రత్యక్షత " లేక ప్రకటనను తాను వ్రాసెనని యోహాను తెలియజేసాడు (ప్రకటన 1:1). "ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛను బట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడిన వారై దేవుని మూలముగా పలికిరి" (2పేతురు 1:21) యని పేతురు చెప్పాడు.

అట్లే అపొస్తలులు కూడ తాము చెప్పుచున్నది లేక వ్రాయుచున్నది తమ స్వంతమాటలు కాదు గాని దేవుని మాటలే యని తెలియజేసారు. ఆదిమ సంఘము కూడ వారి మాటలను అట్లే అంగీకరించారు. "ఆ హేతువు చేతను, మీరు దేవుని గూర్చిన వర్తమాన వాక్యము మా వలన అంగీకరించినప్పుడు, మనుష్యుల వాక్యమని యెంచక అది నిజముగా ఉన్నట్టు దేవుని వాక్యమని దానిని అంగీకరించితిరి గనుక మేమును మానక దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించు చున్నామని" అపొ.పౌలు థెస్సలోనికయలోని సంఘమును అభినందించాడు (1థెస్స 2:13). " ఆ వాక్యమే

విశ్వాసులైన మీలో కార్య సిద్ధి కలుగ జేయుచున్నది" యని కూడ అతడు వారికి చెప్పాడు.

వీటన్నిటిని గమనించితే మనకు యేమి అర్థమవుచున్నది ? బైబిలుకు గ్రంధకర్త దేవుడే గాని మానవుడు కాదని అర్థమవుచున్నది. నిజమే, దాన్ని వ్రాయడంలో ఆయన మానవులను వినియోగించారు. గాని వారు కేవలం లేఖకులే గాని గ్రంధకర్తలు కారని మనం గ్రహించుకోగలం.

రెండవదిగా దేవుడు పరిపూర్ణుడు. ఆయన పనులు కూడ పరిపూర్ణములే. గనుక బైబిలు ఆయన చేసిన పనియే అయితే అదియు కూడ పరిపూర్ణముగనే యుండాలి. నిజానికి బైబిలు పరిపూర్ణమైన గ్రంధం. 16 శతాబ్దాలలో జీవించిన వ్యక్తులను దానిని వ్రాయడానికి దేవుడు వినయోగించినను దానిలో గొప్ప ఏకత్వము కనబడతాది. దాని బోధలలో, ముఖ్య ఉద్దేశంలో, చరిత్రలో.. అన్ని విషయాల్లో బైబిలు పరిపూర్ణమైనది. 1600 సంవత్సరముల కాలములో 40 మందిచే లిఖించ బడినను అందులో యున్న ఏకత్వము అద్భుతం. అందులో స్వవిరుద్ధ సంగతులు యేమీలేవు.

మూడవదిగా, దేవుడు పరిశుద్ధుడు, గనుక ఆయన కృత్యమైన బైబిలు కూడ మానవులకు ఉన్నత నైతిక సూత్రములు లేక ఆదర్శనములు నెలకొల్పవలసి యున్నది. బైబిలు గనుక తాను చెప్పుకొనుచున్నట్లు దేవుని వాక్యమే అయితే అత్యున్నత ఆదర్శములు దానిలో కనబడతాయి. నిజానికి బైబిలును పఠించువారు దానిలో వాటిని తప్పక కనుగొంటారు. మరియే గ్రంధము బోధించని రీతిగా, అది "నిన్ను వలె నీ పొరుగు వానిని ప్రేమించుము" (మత్తయి 22:39), "మనుష్యులు మీకు ఏమి చేయవలెనని మీరు కోరుదురో ఆలాగుననే మీరును వారికి చేయుడి" యని బోధించుచున్నది (మత్తయి 7:12). అంతేకాదు, "నీ శత్రువు ఆకలిగొని యుంటే అతనికి భోజనము పెట్టుము, దప్పిగొని యుంటే

దాహమిమ్ము.... కీడు వలన జయింపబడక మేలు చేత కీడును జయించుము" అని అది బోధించుచున్నది (రోమా 12:20-21) యిట్టి ఉన్నత ఆదర్శ సూత్రములు, మానవుని కంటే ఉన్నత స్థావరము నుండి వెలువడి యుండాలి. ఆ స్థావరము దేవుడే యని మనం అంగీకరించక తప్పదు. ప్రపంచములో యున్న మరియే యితర మత గ్రంధములలోను యిట్టి ఉన్నత ఆధ్యాత్మిక, నైతిక సూత్రములు కనబడవు.

నాల్గవదిగా, బైబిలు దేవుని వాక్యమే అయితే, దానిలాంటి మరొక గ్రంధమును గాని, దానికిమంచిన మరొక గ్రంధమును గాని మానవులు వ్రాయగల్గుట కనుగొనలేము. బైబిలు విషయంలో యిది నూటికి నూరుపాళ్ల సత్యం. బైబిలు లాంటి గ్రంధమును ఎవడును నేటికిని వ్రాయలేదు, వ్రాయలేడు. బైబిలు గ్రంధము సంపూర్తి చేయబడి ఇప్పటికి రెండువేల సంవత్సరములైనను, దానిలాంటి గ్రంధమును ఏ మానవుడు గాని, మానవుల గుంపులు గాని నేటికిని వ్రాయలేకపోయారు. ఎందువలనంటే, అది దేవుని గ్రంధం.

## బైబిలు గ్రంధకర్త యెవరు -2 ?
## (Who is the Author of the Bible -2 ?)

### అనావేశ చరిత్రతో బైబిలు

అనావేశ చరిత్రకారులు గొప్పవ్యక్తుల చరిత్రను వ్రాయునపుడు ఆ వ్యక్తుల సుగుణాలనే ఎత్తి చూపించుచు, దుర్గుణాలపై నిశ్శబ్దముగ యుందురు. బైబిలు పాపమును ద్వేషించుటచే అందలివ్యక్తుల సదలవాట్లనే కాక వారి లోపము లను కూడ బయలుపరచు చున్నది. గొప్ప నీతి సూత్రము లను బోధించిన వాడని అది నోవహును గూర్చి ఒక వైపున చెప్పినను, రెండవ వైపున అతడు ఓడలో నుండి వెలుపలికి వచ్చిన తరువాత మధ్యపానముచే మత్తుడైనట్లు కూడ

తెలియజెప్పుచున్నది.అబ్రహాము దేవుని మిత్రుడని, విశ్వాసు లకు తండ్రియని మంచి పేరును బడసినవాడే అయినను అతడొకమారు మోసగానివలే ప్రవర్తించినట్లు బైబిలు చెప్పు చున్నది. మోషే గొప్ప శక్తివంతుడైన మానవుడని, రాబోవు క్రీస్తు మాదిరి నున్నవాడని మనకందరకు తెలిసినదే. అయితే పాపము చేయుటచే అతడు వాగ్దానము చేయబడిన దేశములో ప్రవేశించలేక పోయెనని బైబిలు నుడువుచున్నది. దేవుని హృదయ సంబంధుడని దావీదు మంచిపేరును సంపాదించు కొనెను. అట్టివాడు మానవ చరిత్ర యంతటి లోను ఘోరమైన నేరమును గావించినట్లు మానవ గ్రంధకర్త యెవడును వ్రాసి యుండలేదు. అయితే బైబిలు దానిని తప్పక చెప్పుచున్నది. మానవ లిఖిత చరిత్రకును, బైబిలునకును మధ్య గల ఈ భేదమును చూచిన తరువాత బైబిలు గ్రంధకర్త మానవుడు కానేరడని మనము అనుమతించక తప్పదు.

## దాని ఏకత్వము

వివిధ కాలములలో నివసించిన ఆయా జాతులలోని, తరగతులలోని **40** మందిని వారి స్వదుద్దేశముల నుపయో గించి ఒక అంశముపై ఒక గ్రంధమును తయారు చేయుడని మనము అడిగిన యెడల వారు వ్రాసిన గ్రంధ మంతయు, విభిన్న సంగతులతోను, స్వవిరుద్ధ సమాచారముతోనునిండియుండ గలదనుటలో సందేహము లేదు.

రకరకాల వృత్తులను కలిగి వివిధ కాలములలో నివసించిన **40** మంది మనుష్యులచే **1600** సం॥లలో లిఖింప బడిన **66** పుస్తకముల సంపుటియే బైబిలు. వారిలో కొందరు రాజులు, కొందరు గొల్లలు, మరికొందరు పల్లెవారు, ఒకడు వైద్యుడు, మరి యొకడు తృణీకరింపబడిన సుంకరి. వారు వివిధ కోణముల నుండి అనేక అంశములను గూర్చి వ్రాసిరి. అయినను వారి యందరి కృషిని సంపుటిగా చేసి చూస్తే వారందరు ఒకే ముఖ్యాంశమును అనగా మానవుని రక్షణను

గూర్చి ఒకరి నొకరు విరుద్ధముగా కాక ఏకమైనట్లు వ్రాసిరి. **40**మంది వ్రాసిన వ్రాతలలో గల ఈ గొప్ప ఐక్యతను గూర్చి మనమే మని చెప్పుకొందుము? దైవావేశములేని సామాన్యమానవులే దానికి కర్తలని మనము చెప్పుదుమా? లేక బైబిలు లేఖకులు గ్రంధకర్తలకు కర్తయైన వానిచే నడింపించబడిరని చెప్పుట మరింత సమంజసము కాదా?

## ప్రకృతిని - బైబిలును పరిశీలించుదాం

దేవుడున్నాడని నమ్మువారందరు ఆయనే ప్రకృతికి కూడా కర్తయని అంగీకరింతురు. దేవుని ప్రకృతి గ్రంధము నకు, బైబిలునకు అత్యంత సన్నిహిత సంబంధము గలదు. ఈ రెండును ఒకే వ్యక్తి వలన కలిగెననుటలో సందేహము లేనంతటి సన్నిహితత్వము గలదు.

ప్రకృతి, బైబిలు ఈ రెండును సూక్ష్మ సంగతులలోను, గంభీర సంగతులలోను ఒకే విధముగ నున్నవి. ప్రకృతికూడ ఒక వైపున మనకు అతిసూక్ష్మముగ నగుపడును. వ్యవసాయ కుడు పొలమును ఎప్పుడు దున్ని, విత్తనములు జల్లవలెనో ఎరుగును. విత్తనములు మొలకెత్తగా పంట పెరుగుటకతడు భూమినెట్లు బలపరచవలెనో ఎరుగును. కోతకాలము రాగానే కోతనెట్లు కోయవలెనో, అతడెరుగును. అయినను గొప్ప మేధావులు కూడా వివరించలేని గంభీర సంగతులు ప్రకృతి యందిమిడి యున్నవి. విత్తనములో ఇమిడి యున్న "జీవము" అను శక్తి యేమి ? విత్తనము భూమిలో నాటబడిన తరువాత అది భూమి వెలుపలికెట్లు మొలకెత్తును ? అది ఒక మొక్కవలే పెరిగి తన జాతి ప్రకారమే.ఎట్లు ఫలములను నిచ్చును ? వీటిన్నిటికి గొప్ప శాస్త్రవేత్తలు కూడ జవాబీయ లేరనుట సత్యము.

మనమందరము సాధారణముగా ఉపయోగించునది ఆహారము. మనము జీవించు ప్రతిదినము దానిని భుజించెదము. అది చాల సూక్ష్మమైన పనియే.

చిన్నపిల్లవాడు కూడ ఇట్టే అన్నము తినుట ఎరుగును. మన ప్రాణము మనము భుజించు ఆహారముపై ఆధారపడి యున్నది. జీర్ణక్రియను మనమెరుగము. మనము తినుచున్న ఆహారము ఎట్లు జీర్ణమగుచున్నదో, ఎట్లు రక్తముగాను, శక్తిగాను మారుచున్నదో మనలో ఎవరికిని తెలియదు.

బైబిలునందు కూడా అట్లే చిన్న పిల్లవాడు సహితము అర్థము చేసికొన గల్గునట్టి సత్యములున్నవి. దేవుని యెడల మన బాధ్యతను గూర్చిన విషయములు మనము తప్పు చేయుటకు వీలులేనంత విపులముగా అందు వ్రాయబడెను. అయితే గొప్ప మేధావులు కూడ విప్పిచెప్పలేని పరమ సత్యములందున్నవి. ప్రపంచ మందనేక మేధావులు బైబిలును పఠించుటలో తమ జీవిత కాలమంతయు వెచ్చించి నను దాని పై పై పొరలనే తెలిసికొన గల్గితిమని చెప్పిరి.

స్వవిరుద్ధ సంగతులవలె కన్పడు సందర్భములలో బైబిలు ప్రకృతి ఒకే విధముగ నున్నవి. ఒక చిన్న రాయిని నీటి పైభాగముననను, ఒక పెద్ద బెండును నీటి అడుగు భాగముననను వదలిన యెడల రాయి క్రిందకును, బెండు పైకిని వచ్చును.

ప్రకృతి సూత్రములకిది విరుద్ధమువలె మనకు కన్పించును. అయితే భూమ్యాకర్షణ సూత్రములను మన మెరిగిన యెడల ఆ స్వవిరుద్ధ సంగతి వలే కన్పడునది మాయమగును.

సందేహశీలునికి లేక పైపైనే చదువువానికి బైబిలు నందు కూడ అట్లే కొన్ని స్వవిరుద్ధములవలె కన్పడు సంగతులు తటస్థించును. అయితే ఈయబడిన వాస్తవ ముల నన్నిటిని జాగ్రత్తగా అతడు చదివిన, అవి మాయమై పోవును. ఉదా:- గలతీ 6:2లో పౌలు గలతీయులకు ఇట్లు చెప్పెను :

"ఒకని భారము నొకడు భరించి ఈలాగున క్రీస్తు నియమమును పూర్తిగా

నెరవేర్చుడి". అయితే 5వ వచనము లో "ప్రతివాడును తన బరువును తానే భరించుకొనవలెను గదా ?" యని అతడు మరల చెప్పెను. ఇక్కడ ఒకదానికొకటి విరుద్ధముగా నున్నట్లగుపడుచున్నది. జాగరూక పఠనము వలన ఇక్కడ పౌలు రెండురకములైన భారములను గూర్చి చెప్పుచున్నట్లు మనము గమనించెదము. ఒకరినొకరు భరించుకొను ధన, విచార, సంతోషభారములు కలవు. అయితే ఒకడు దేవుని యెడల తనకుగల బాధ్యత భారము కూడ కలదు. దానిని మరియొకడు భరించలేడు. ప్రకృతిలో వలెనే, బైబిలునందున్న వాస్తవముల నన్నిటి నెరుగుట వలన స్వవిరుద్ధ సంగతుల వలె కన్పడునవి ఇట్లే మాయ మగును.

మానవుని నిత్యావసరములకు ప్రకృతి, బైబిలు ఈ రెండును ఒకే విధముగ ఉపయోగపడుచున్నవి. ప్రకృతిలో మనము పీల్చుకొను గాలి, త్రాగేనీరు, భుజించు ఆహారము ఒక ప్రత్యేక జాతికి ఏర్పడినవి కావు. అన్ని యుగములలో నివసించిన మానవులందరికి అవి అవుసరమై యున్నవి. వృద్ధులు,యౌవనులు, ధనికులు, ధనహీనులు, స్వతంత్రులు, బానిసలు, ప్రతివారును తమతమ భౌతిక అవుసరతలను ప్రకృతి వలన తీర్చుకొందురు.

బైబిలును మనము గమనించిన, అదియునట్లే మానవులందరికి ఉపకారివలె నున్నది. జాతి,కుల, కాల, వివక్షత లేక అందరి హృదయములను ఒడిసిపట్టుకొన గల్గిన సమాచారమందిమిడి యున్నది. మానవులు ఏయే దేశముల లో నున్నను వారు "మన బైబిలు" అని ఈ గ్రంథమును గూర్చి చెప్పుకొందురు.

బైబిలు గ్రంధకర్త యెవరు ? ఇంతవరకు చూపిన ఋజువులను బట్టి అతడు మానవుడు కాదు అని తేటబడి నది. మానవుడు వ్రాయగల్గినను దానిని అతడు వ్రాసియుండ లేదు. నాస్తిక ప్రపంచమును తల్లడిల్ల చేయుచు యుగ యుగములలోను, నిలిచిన ఒకే ఒక్క సరియైన జవాబు దీనికి కలదు. అది "ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛను బట్టి కలుగలేదుగాని, మనుష్యులు

పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడిన వారై దేవుని మూలముగా పలికిరి" అనునది (2పేతురు 1:21). బైబిలు దేవుని వాక్యము. దానిని విని విశ్వసించి దానికి లోబడిన యెడల నీవు ధన్యుడవు !

- జాషువా గూటం.

సంఘచరిత్ర :

# మతశాఖల బోధకును బైబిలు బోధకును గల వ్యత్యాసములు - 2

( Differences between Denominational Doctrines and the Bible Teachings )

(గత సంచిక తరువాయి)

## 4. తొలి నిర్ణయము లేక ఎన్నిక

రక్షణ విషయంలో దేవుని సార్వభౌమ్యాన్ని గూర్చిన తన అభిప్రాయములను బట్టి జాన్‌కేల్విన్ తొలి నిర్ణయము లేక ఎన్నిక అనే సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టెను. అయితే ఈ సిద్ధాంతము బైబిలులో ఎక్కడా బోధింపబడలేదు. లేఖనములు ఈ సిద్ధాంతమునకు ఎక్కడా అనుకూలముగా లేవు. దేవుడే ముందుగా కొందరిని ఎంచుకొన్నాడనుట సరికాదు. ఆ ఎంపిక చేయవలసినది మానవుడే. దేవుని ఎంచుకొనే వారిని దేవుడు ఎంచుకొంటాడు.

బైబిలు బోధ :

సువార్తను విని, విశ్వసించి దానికి లోబడువారందరు రక్షింపబడే తరుణమును కలిగియున్నారు. నమ్ము ప్రతివాడును రక్షింపబడును (యోహాను 3:16).

"నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును" (మార్కు 16:16).

"మీ పిలుపును ఏర్పాటును నిశ్చయము చేసికొనుటకు మరి జాగ్రత్త పడుడి" (2 పేతురు 1:10).

మానవుడు మారుమనస్సు పొంది నాశనమును తప్పించుకొనగలడు (2 పేతురు 3:9).

మానవుడు సువార్తను అంగీకరించుట వలన గాని, లేదా తిరస్కరించుట వలన గాని రక్షణ పొందగలడు, లేదా నశించగలడు అని ఈ లేఖనములు, మరికొన్ని లేఖనములు కూడ తెలియజేయుచున్నవి.

జాన్‌కేల్విన్ (మతశాఖల) బోధ :

"దేవుడు తన మహిమను ప్రత్యక్ష పరచునట్లు తాను చేసిన నిత్యనాశనము ద్వారా కొందరు మానవులు, దేవదూతలు నిత్యజీవమునకును, తదితర మానవులు, దూతలు నిత్యనాశనమునకును ముందేనిర్ణయింపబడిరి. ఇట్లు ముందుగా నిర్ణయింపబడిన వారి సంఖ్య కూడా ముందుగనే నిర్ణయింపబడినది. అది హెచ్చదు, తగ్గదు" (West minister Confession of Faith, Art. 3,4,5).

గమనిక :

ఈ సిద్ధాంతము మానవుని ఔన్నత్యమును నిరాకరించి వానిని ఒక మర మనిషిగా తయారుచేయుచున్నది. కొందరు రక్షింపబడడానికి, మరికొందరు నశింపజేయ బడడానికి ముందుగానే దేవుడు నిర్ణయం చేస్తే, ఆ నిర్ణయాన్ని మార్పుజేయడానికి మానవుడు చేసేది ఏమీ వుండదు. స్వేచ్ఛాపూర్వకముగా మానవుడు ఎంపిక చేసు కోలేడు. ఎంపిక చేసుకొనే శక్తి వానికి లేదు గనుక అతడొక యంత్రము వంటివాడే యగును. అతడు నశించాలో లేక రక్షింపబడాలో దేవుడే ముందుగా నిర్ణయించే వాడు గనుక ఆయన చేతిలో అతడొక మరమనిషే. ఈ సిద్ధాంతము లేఖనములకు విరుద్ధముగా యున్నది. "దేవుడు పక్షపాతి కాడు" అని అపొ.కా. 10:34 చెప్పుచున్నది. గనుక ఈ సిద్ధాంతము పచ్చి అబద్ధము.

- నైతికముగా ఎంపిక చేసుకొనే స్వేచ్ఛను మానవుడు కలిగి యున్నాడని బైబిలు బోధించుచున్నది (ఫిలిప్పీ 2:12).

- మానవుడు దేవుని చిత్తమునకు లోబడుటకు ఎంచుకొంటే రక్షణ పొంద గలడని బైబిలు బోధించుచున్నది.

- మన విధి లేక అదృష్టమును (fate) దేవుడే ముందు నిర్ణయించి సీలు వేసేసాడని బైబిలు బోధించుటలేదు (యోహాను 3:16; 2 పేతురు 3:9).

- మానవులు అవిధేయత చూపించి శిక్షింపబడతారని బైబిలు బోధించు చున్నది (లేవీ.కా. 10:1-3).

- క్రైస్తవులు పాపం చేసి తొలగిపోగలరని బైబిలు బోధించుచున్నది (1కొరిం. 10:5-12).

ఈ అబద్ధ సిద్ధాంతము వలన మరికొన్ని అబద్ధ సిద్ధాంతములు ఉద్భవించినవి. దేవుడు ముందుగానే నిర్ణయించేసినందువలన విశ్వాసమునుండి ఎవడైనా తొలగి పోవుట అసంభవము. ఏలయనగా ఫలానవాడు రక్షింపబడాలని దేవుడే ముందుగా నిర్ణయించేస్తే వాడు రక్షణలో నుండి తొలగిపోలేడు!!

## 5. ప్రత్యక్షముగా పరిశుద్ధాత్ముని పని
## (Direct operation of the Holy Spirit)

తొలి నిర్ణయము లేక ఎన్నిక అను అబద్ధ సిద్ధాంతము వలన ఉద్భవించిన ఇంకో మొదటి అబద్ధ సిద్ధాంతము, మానవుని హృదయముపై పరిశుద్ధాత్ముడు ప్రత్యక్షముగా, నేరుగా పని చేయుననునది. ఈ సిద్ధాంతము ప్రకారము మానవుడు కేవలము బాధ్యతారహితుడు, నిర్లక్ష్యము గలవాడు. దేవుడు మాత్రము రక్షించును, దేవుడు మాత్రము శిక్షించును. రక్షింపబడుటకు మానవుడు చేయగలిగింది ఏమీ లేదు. అందువలన అతనిని రక్షించడానికి, తిరిగి జనింపచేయడానికి అతనిపై

నేరుగా పరిశుద్ధాత్ముని ప్రభావము అవసరం. అయితే

**పరిశుద్ధాత్ముడు మనలను మార్చునా ?**

**బైబిలు బోధ :**

ప్రభువుకు విధేయులైన వారందరికీ పరిశుద్ధాత్ముడు వాగ్దానము చేయబడెను (అపొ.కా. 5:32). మారుమనస్సుపొంది బాప్తిస్మము పొందిన వారికి పరిశుద్ధాత్మ అను వరము వాగ్దానముచేయబడెను (అపొ.కా. 2:38). బాప్తిస్మము పొందనివానిని మార్చుటకు పరిశుద్ధాత్ముడు నేరుగా వారి హృదయములో పని చేయడు గాని బాప్తిస్మము పొందిన విశ్వాసిలో నివసించును.

అపొస్తులుల కార్యముల గ్రంథములో మార్పుజెందిన ప్రతివారు పరిశుద్ధాత్ముడు నేరుగా వారి హృదయములో పనిచేయుట వలన గాక దేవుని వాక్యము వలన మార్పుజెందినట్లు గమనించగలము.

మతశాఖల బోధ :

"ప్రభువును జీవనదాతయైన పరిశుద్ధాత్ముని మేము నమ్ముదుము. ఆయన మానవుల హృదయములపై చలించుచు వారు కీడు చేయ కుండుటకును, మేలు చేయుటకును పనిచేయును. తండ్రిని అడిగిన ప్రతి వానికి పరిశుద్ధాత్మ ననుగ్రహించుటకు ఆయన మనస్సు కలిగియున్నాడు. వారు సువార్త పిలుపువిని దానికి లోబడునట్లు ఆయన ప్రోత్సహించును".

గమనిక :

ఈ సిద్ధాంతము బైబిలులోని అనేక లేఖనములకు విరుద్ధముగా యున్నది. దానిని తరువాత అంశములలో విపులముగా గమనించుదము.

## 6. విశ్వాస భ్రష్టత్వం అసంభవము
## (Impossibility of Apostacy)

తొలి నిర్ణయము అనే అబద్ధ సిద్ధాంతమునుండి ఉద్భవించిన రెండోది విశ్వాస భ్రష్టత్వము అసంభవమనునది. మానవుడు రక్షింపబడిన తరువాత, అతడు నిరంతరము రక్షింపబడే యుంటాడు. నాశనము చెందడు అనేది ఈ సిద్ధాంతభావము. మానవుని ఎంపిక యేమీ లేకుండా దేవుడే అతనిని రక్షిస్తాడు లేక శిక్షిస్తాడు. మరియు పరిశుద్ధాత్ముడునేరుగా అతనికి పునర్జన్మ ప్రసాదిస్తాడు. గనుక ఒకడు మార్పుజెందిన తరువాత నాశనమవడానికి యేమీ చేయలేడని జాన్ కేల్విన్ ఆలోచించాడు. ఈ రీతిగా మానవుడు కృపనుండి తొలగిపోలేడు అనేసిద్ధాంతము ఉద్భవించినది. అయితే రక్షణ నిశ్చయమా ? ఖచ్చితమా ?

**బైబిలు బోధ :**

రక్షణ షరతులపై ఆధారపడినట్టిది.

బుద్ధిపూర్వకముగా పాపము చేస్తే పతనమౌతాము (హెబ్రీ **10:26**).

రక్షింపబడి పడిపోయిన వారు మారుమనస్సు పొందునట్లు నూతన పరచబడుట అసాధ్యము (హెబ్రీ **6:1-6**).

విశ్వాస భ్రష్టత్వమును గూర్చిన అపాయమును పౌలు గుర్తించెను (**1**కొరిం. **9:27**).

క్రైస్తవులై ఇంకా ధర్మశాస్త్రము యొక్క ఏలుబడిలో యున్నామని తలంచేవారు కృపనుండి తొలగిపోయిన వారని చెప్పబడెను (గలతీ. 5:4).

దిగువ వచనములను పరిశీలించుడి :

**2పేతురు 1:5-12; 1కొరింథీ. 10:12**

1యోహాను 2:1-2; 1యోహాను 1:9

మతశాఖల బోధ :

- రక్షణ స్థిరము.
- ఒక్కసారి రక్షింపబడితే, ఎల్లప్పుడు రక్షింపబడేయుంటాడు. ఒకసారి కృపలో యుంటే ఎల్లప్పుడూ కృపలోనే యుంటాడు.
- రక్షింపబడిన వ్యక్తి కృపలో నుండి తొలగిపోవునట్లుగా పాపము చేయలేడు. అందు వలన నశించడు.
- "నీవు దానిని వెదకితే కనుగొనవు. కనుగొంటే దానిని పొందలేవు. దానిని పొందితే పోగొట్టుకోలేవు. పోగొట్టుకొంటే దానిని ఎన్నడూ పొంది యుండవు". ఇంకో మాటలో ఇది 'విశ్వాసుల భద్రత' బోధ యనవచ్చును.

గమనిక :

మానవుడు రక్షింపబడాలంటే అతడు బైబిలో దేవుడేర్పరచిన కొన్ని షరతులకు లోబడాలి. ఆయా షరతులకు లోబడితేనే రక్షింపగలడు. రక్షింపబడిన తరువాత కూడ అతడు "మరణ పర్యంతము నమ్మకముగా యుండాలి". క్రైస్తవ లక్షణాలను అలవరచుకొని జీవించాలి (2పేతురు 1:5-12; ప్రకటన 2:10).

## 7. సమగ్ర పారంపర్య భ్రష్టత్వము
## (Total Hereditary Depravity)

జాన్ కేల్విన్ సిద్ధాంతములతో ముడివడియున్న మరి యొక బోధ "మూలపాపము" అనునది. ప్రతి వ్యక్తి సమగ్రభ్రష్టుడై జన్మించును. ఏలయనగా అది పారంపర్యముగా అతనికి సంక్రమించినట్టిది యని జాన్‌కేల్విన్ తలంచాడు. మానవుడు స్వభావసిద్ధముగా భ్రష్టుడు, నాశనమునకు అర్హుడు అని దాని యుద్దేశము. కేథలిక్కులు శతాబ్దాలుగా బోధిస్తుయున్న "జన్మపాపము" ను గూర్చిన

బోధయే యిది. అయితే పాపమునుండి శుద్ధులగుటకు బైబిలు బోధించు షరతులకు పసిబిడ్డలు లోబడగలరా?

బైబిలు బోధ :

రక్షణ పొందాలంటే విశ్వసించాలి (రోమా 10:13-17; హెబ్రీ 11:6). మారుమనస్సు అవసరము (లూకా. 13:3; అపొ.కా. 15:30). విశ్వాసాన్ని ఒప్పుకోవాలి (మత్త. 10:32). బాప్తిస్మము పొందాలి (అపొ.కా. 2:38; 22:16). ఇవి రక్షణకు అవసరమైయున్న సంగతులు. అయితే పసిపిల్లలు ఇవి యేమీ చేయలేరు. పసిపిల్లలు జన్మ పాపముతో పుట్టినవారైతే, రక్షింపబడడానికి పై సంగతులను వారు చేయలేకపోతే, వారెట్లు రక్షింపబడగలరు? పసిపిల్లలు పవిత్రమయినవారు, అమాయకులు, అట్టివారిదే పరలోకరాజ్యమని యేసుప్రభువు చెప్పెను (మత్త.10:15).

**మతశాఖల బోధ :**

అర్ధరాత్రి అంధకారము ఎంత నల్లగా యుండునో అంత నల్లగా ప్రతి ఆత్మ ఈలోకములో జన్మించునని కేల్విన్ బోధించెను.

ఆదాము యొక్క పాపము పారంపర్యముగా అందరికీ సంక్రమించును. ఆదాము హవ్వల పాపమే మానవజాతికి మూలము. అందువలన దుష్టనైజము తరముల వెంబడి సంక్రమించినది.

"మనము ఆదాము సంతతివారము గాన తరతరములు అతని పాపము పయనించి మన తల్లితండ్రులకును వారినుండి మనకును సంక్రమించినది. అందుచే మనము జన్మనుండియే పాపులమైతిమి".

**గమనిక :** ఈ అబద్ధ బోధకు ఆధారముగా కీర్తనలు 58:3 ను వినియోగిస్తారు. నిజానికి ఆలేఖనము వారి బోధను ఖండించుచున్నది. "తల్లి కడుపున పుట్టినది మొదలకొని భక్తిహీనులు విపరీతమైన బుద్ధి కలిగియుందురు. పుట్టిన తోడనే

అబద్ధము లాడుచు తప్పిపోవుదురు" అని అక్కడ వ్రాయబడి యున్నది. వారు తప్పిపోయి తల్లికడుపున పుట్టుదురు అని దావీదు అక్కడ చెప్పలేదు. వారు తల్లి కడుపులో తప్పిపోలేదు. వారు మాటలాడుట మొదలిడినప్పటి నుండి తప్పి పోవుదురు. అందువలన మానవుడు జన్మించిన తరువాతనే తప్పిపోవును. తప్పిపోతే ఎటువెళ్తాడు? దేవుని వైపా? సాతాను వైపా? అతడు పారంపర్య పాపముతో జన్మించితే అతడు పుట్టేసరికే సాతానుతో యుంటాడు. గనుక ఎక్కడికైనా తప్పిపోతే అతడు దేవుని వైపు వెళ్ళాలి.

మానవుడు జన్మించినపుడు పవిత్రుడుగా, అమాయకుడుగా జన్మిస్తాడని బైబిలు బోధించుచున్నది. దేవుడు మన ఆత్మలకు తండ్రియని హెబ్రీ 12:9లో వ్రాయబడి యున్నది. మానవుడు బాధ్యతాయుక్త వయస్సు వచ్చుసరికి దేవుని విడిచి అపవాది వైపు వెళ్తాడు. తప్పిపోతాడు.

"నీవు నియమింపబడిన దినము మొదలుకొని పాపము నీయందు కనబడు వరకు ప్రవర్తన విషయములో నీవు యదార్థవంతుడవుగా ఉంటివి" యని యెహెజ్కేలు 28:15 లో వ్రాయబడియున్నది. పాపము అతనిలో కనబడువరకు మానవుడు యదార్థవంతుడు. కనుక మానవుడు పాపముతో ఈలోకంలో జన్మించు నను సిద్ధాంతము బైబిలు విరుద్ధము.

## క్రైస్తవులు - ప్రభుత్వము
### (Christians and the Government)

క్రైస్తవులు ప్రభుత్వ ఉద్యోగము చేయవచ్చునా ? క్రైస్తవులు ఎలక్షన్లలో ఓట్లు వేయవచ్చునా ? వారి జాతీయ పతాకానికి వందనము చెప్పవచ్చునా ? వారి జాతీయ గీతాన్ని ఆలపించవచ్చునా ? అను ప్రశ్నలను తరుచు క్రైస్తవులు ఎదుర్కొంటారు. కొందరు రాజకీయవేత్తలు, కొందరు ప్రభుత్వ ఉద్యోగులు అవినీతి

పరులు గనుక ఇట్టి ప్రశ్నలను క్రైస్తవుడు తనలో తాను వేసుకొంటాడు. అది సహజమే. అయితే వీటి విషయమై బైబిలు ఏమి చెప్పుచున్నది ?

యేసు ఈ లోకంలో యున్నప్పుడు ఇశ్రాయేలు దేశమును రోమీయులు పాలించుచుండిరి. యూదులు రోమీయులను ద్వేషించుచుండిరి. రోమా ప్రభుత్వాధికారులు అవినీతిపరులు, కఠినులు. ఒక సందర్భములో యేసును చిక్కుపరచవలెనని పరిసయ్యులు ఆయన నొక ప్రశ్న అడిగిరి : "కైసరుకు పన్నిచ్చుట **న్యాయమా ?** కాదా ?" (మత్తయి **22:17**). కైసరుకు పన్ను కట్టుట న్యాయము కాదని యేసు చెబితే, రోమా అధికారులు ఆయన మీద నేరము మోపుదురు. పన్ను కట్టుట న్యాయమే యని చెబితే యూదులు ఆయన మీద నేరము మోపుదురు. గనుక యేసును ఇరకాటంలో పెట్టేసామని పరిసయ్యులు తలంచారు. వారాయనను శోధించుచున్నారని యేసు ఎరిగి, "పన్ను రూక యొకటి నాకు చూపుడని వారితో చెప్పగా వారాయన యొద్దకు ఒక దేనారము తెచ్చిరి. అప్పుడాయన ఈ రూపమును, పై వ్రాతయు ఎవరివని వారి నడుగగా - వారు కైసరువనిరి. అందుకాయన - ఆలాగైతే కైసరువి కైసరుకును, దేవునివి దేవునికిని చెల్లించుడని వారితో చెప్పెను" (మత్తయి **22:15-21**).

## రెండు రాజ్యములు

ప్రతి క్రైస్తవుడు రెండు రాజ్యములలో నివసించును. ఒకటి ఆత్మీయమైనది, రెండవది భౌతికమైనది. మనము మొదటిగా క్రీస్తు రాజ్యవాసులము. క్రీస్తు రాజ్యమే క్రీస్తు సంఘము (మత్తయి **16:18-19**; కొలస్స **1:13**). అదే సమయంలో ఏ దేశస్థులమో, ఆ దేశ వాసులము, అంటే భారత వాసులం. ఈ లోకంలో ఏ దేశ పౌరులమైనను ఆ దేశంలో మంచి పౌరులుగ జీవించాలి. ఆత్మీయ రాజ్యములోను, భౌతిక రాజ్యములోను మనం నిర్వర్తించవలసిన విధులున్నాయి.

రోమన్లు ఈ లోకాన్ని పాలించుచున్న రోజులలోనే అపో.పౌలు కూడ

జీవించాడు. అతడు రోమా సామ్రాజ్య పౌరుడు (అపొ.కా. 22:25-29). పౌలు రోమాలో యున్న క్రైస్తవులకు తన పత్రిక వ్రాయుసరికి నీరో చక్రవర్తి పాలించు చుండెను. ఆ రోజుల్లో నీరోను మించిన అవినీతి పరుడైన పాలకుడు ఇంకొకడు లేడు. అయినను, పౌలు క్రైస్తవులకు ఇట్లు వ్రాసాడు :

"ప్రతివాడును పై అధికారులకు లోబడియుండవలెను; ఏలయనగా దేవుని వలన కలిగినది తప్ప మరి ఏ అధికారమును లేదు; ఉన్న అధికారములు దేవుని వలననే నియమింపబడి యున్నవి. కాబట్టి అధికారమును ఎదిరించువాడు దేవుని నియమమును ఎదిరించు చున్నాడు; ఎదిరించు వారు తమ మీదికి తామే శిక్ష తెచ్చుకొందురు. ప్రభుత్వము చేయువారు చెడ్డ కార్యములకే గాని మంచి కార్యములకు భయంకరులు కారు; నీకు మేలు కలుగుటకు అధికారులు దేవుని పరిచారకులు; వారికి భయపడక ఉండగోరితివా, మేలు చేయుము, అప్పుడు వారి చేత మెప్పు పొందుదువు. నీవు చెడ్డది చేసిన యెడల భయపడుము, వారు ఊరకయే ఖడ్గము ధరింపరు; కీడు చేయు వానిమీద ఆగ్రహము చూపుటకై వారు ప్రతీకారము చేయు దేవుని పరిచారకులు. కాబట్టి ఆగ్రహ భయమును బట్టిగాక మనస్సాక్షిని బట్టియు లోబడియుండుట ఆవశ్యకము. ఏలయనగా వారు దేవుని సేవకులైయుండి యెల్లప్పుడు ఈ సేవయందే పని కలిగి యుందురు. ఇందుకే గదా మీరు పన్నుకూడ చెల్లించు చున్నారు ? కాబట్టి యెవనికి పన్నో వానికి పన్నును, ఎవనికి సుంకమో వానికి సుంకమును చెల్లించుడి. ఎవని యెడల భయముండవలెనో వానియెడల భయమును, ఎవని యెడల సన్మాన ముండవలెనో వానియెడల సన్మానమును కలిగియుండి అందరికిని వారి వారి ఋణములను తీర్చుడి" (రోమా 13:1-7).

అపొ.పేతురు కూడ క్రైస్తవులను ఇట్లు హెచ్చరించాడు : "మనుష్యులు నియమించు ప్రతి కట్టడకును ప్రభువు నిమిత్తమై లోబడి యుండుడి. రాజు అందరికిని అధిపతియనియు, నాయకులు దుర్మార్గులకు ప్రతిదండన

చేయుటకును సన్మార్గులకు మెప్పు కలుగుటకును రాజు వలన పంపబడిన వారనియు వారికి లోబడి యుండుడి. ఏలయనగా మీరిట్లు యుక్త ప్రవర్తన గలవారై అజ్ఞానముగా మాటలాడు మూర్ఖుల నోరుమూయుట దేవుని చిత్తము. స్వతంత్రులై యుండియు దుష్టత్వము కప్పి పెట్టుటకు మీ స్వాతంత్ర్యమును వినియోగపరచక, దేవునికి దాసులమని లోబడియుండుడి. అందరిని సన్మానించుడి, సహోదరులను ప్రేమించుడి, దేవునికి భయపడుడి. రాజును సన్మానించుడి" (1పేతురు 2:13-17).

## దేవుని చట్టం - మానవుని చట్టం

అయితే దేవుని చట్టానికి వ్యతిరేకముగా వున్న దానిని ప్రభుత్వం ఆజ్ఞాపించితే యేమి చేయాలి ? దేవుని ఆరాధించరాదని క్రైస్తవులను ప్రభుత్వం ఆదేశించితే యేమి చేయాలి ? అని కొందరడుగుతారు. దేవుని చట్టానికీ మానవుని చట్టానికీ పరస్పర వైరుధ్యం ఉంటే, దేవుని చట్టానికి విధేయత చూపాలి. అపొస్తలులు క్రీస్తును గూర్చి ప్రకటించు చున్నందువలన అధికారులు వారిని బంధించారు. "మీరు ఈ నామమును బట్టి బోధింపకూడదని మేము మీకు ఖండితముగా ఆజ్ఞాపింపలేదా ? ఇదిగో మీరు యెరూషలేమును మీ బోధతో నింపి యీ మనుష్యుని హత్య మా మీదికి తేవలెనని ఉద్దేశించుచున్నారని" వారనగా "అందుకు పేతురును, అపొస్తలులును - మనుష్యులకు కాదు మేము దేవునికే లోబడవలెను గదా ?" అని చెప్పిరి (అపొ.కా. 5:28-29). మనము దేవుని చట్టాన్ని మానవుని చట్టాన్ని గౌరవించాలి. అయితే ఈ రెంటిలోను వైరుధ్యం ఉంటే, దేవుని చట్టాన్ని గౌరవించాలి.

ఈ లోకస్థులు మాత్రమే ప్రభుత్వ ఉద్యోగం చేయాలి, క్రైస్తవులు చేయకూడదని కొందరంటారు. బైబిలు అట్లు బోధించుటలేదు. దేవుని చట్టము అందరికీ ఒకేలాగున వర్తిస్తాది. క్రైస్తవుడు ప్రభుత్వ ఉద్యోగం చేస్తే తప్పయితే, ఆ ఉద్యోగం ఎవరు చేసినా తప్పే. క్రైస్తవేతరుడు ప్రభుత్వ ఉద్యోగం చేయుట

మంచిదయితే, క్రైస్తవునికి కూడ ఆ ఉద్యోగం మంచిదే.

ఒక్కోసారి పలుకుబడి, అధికారం గల స్థానంలోయుంటే తప్పటడుగులు వేసే అవకాశాల, శోధనలు పెక్కు కలుగవచ్చు. అధికార స్థానాన్ని దుర్వియోగం పరచే అవకాశాలు రావచ్చును. అవినీతికి పాల్పడి విపరీతమైన ధనార్జన చేసే అవకాశాలు మెండుగా రావచ్చును. అయితే క్రైస్తవులు ఏ స్థానంలో యున్నా నీతి న్యాయములతోను, యదార్థతతోను అన్ని వేళలా ప్రవర్తించాలి. యిది వ్యాపారంలోను, వృత్తిలోను, ఉద్యోగంలోను కూడ వర్తించాలి, వర్తిస్తాది.

క్రైస్తవులు పన్ను చెల్లించాలా ? అవును. క్రైస్తవులు జాతీయ గీతాన్ని ఆలపించి, జాతీయ పతాకానికి వందనం చేయాలా ? అవును. ఎలక్షన్లలో ఓటు వేయ్యొచ్చా ? అవును. అతడు ప్రభుత్వంలో గాని, రాజకీయాలలో గాని ప్రవేశించవచ్చా ? అవును. అయితే వీటన్నిటి కంటే ముందుగా క్రైస్తవుడు మొదట దేవుని రాజ్యమును, ఆయన నీతిని వెదకాలి (మత్తయి 6:33).

క్రైస్తవులు ప్రభువు దృష్టియందు మాత్రమేగాక, మనుష్యుల దృష్టియందును యోగ్యమైన వాటిని గూర్చి శ్రద్ధగా ఆలోచించుకొనవలెను (2కొరింథీ 8:21).

- రాడ్ రూథర్‌ఫర్డ్
(The Bible Teacher)

## ప్రార్థనను గూర్చి నా భావాలు
(What Prayer means to me)

ప్రార్థన ద్వారా దేవునితో మాట్లాడే అవకాశం నాకు కలుగుతుంది. బైబిలు ద్వారా ఆయన నాతో మాట్లాడును. ప్రార్థన ద్వారా నేనాయనతో మాట్లాడుదును. మా సంభాషణ ఇట్లు కొనసాగును గనుక నాకు చాల ఆదరణ లభించును.

ప్రార్థించునప్పుడు నేను నటించనవుసరంలేదు. ఎవరినీ మెప్పించనవుసరం లేదు. దేవునికి నా రహస్యాలన్నీ తెలుసు గనుక నేనాయన దగ్గర నా పాపములు ఒప్పుకొనునప్పుడు ఆయన నన్ను చులకన చేయరు.

నేను ఏకాకిగా యున్నపుడు, నా ప్రార్ధన ఆలకించడానికి దేవుడు వేచి యుండును. యెహోవా దేవుడు యెహోషువకు యిచ్చిన వాగ్దానమే నాకును వర్తించును : "నిన్ను ఏ మాత్రమును విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయను" (హెబ్రీ 13:5; యెహోషువ 1:5). ఆలకించుటకు ఆయన ఎన్నడు నిరాకరించడు. తన వాక్యంలో ఎల్లప్పుడు నాకు ఆదరణ దొరకును.

నేను జ్ఞానము కొరకు తరుచు ప్రార్థించాలి. దేవుడు దానిని నాకను గ్రహించునని ఎరుగుదును. "మీలో ఎవనికైనను జ్ఞానము కొదువగా ఉన్నయెడల అతడు దేవుని అడుగవలెను, అప్పుడది అతనికి అనుగ్రహింపబడును. ఆయన ఎవనిని గద్దింపక అందరికిని ధారాళముగా దయ చేయువాడు. అయితే అతడు ఏ మాత్రమును సందేహింపక విశ్వాసముతో అడుగవలెను" (యాకోబు 1:5-6). ఆయన సహాయం లేకపోతే నేనెన్నో పొరబాట్లు చేసే ప్రమాదమున్నది.

ఒక్కోసారి కొన్ని క్లిష్ట పరిస్థితులలో నేనుండవచ్చును. అట్టి సందర్భాల్లో దేవునికేమి చెప్పాలో నాకు తోచక పోవచ్చును. అయితే ఆత్మ నా పక్షమున దేవునితో విజ్ఞాపన చేయును. "అటువలె ఆత్మయు మన బలహీనతను చూచి సహాయము చేయుచున్నాడు. ఏలయనగా మనము యుక్తముగా ఏలాగు ప్రార్ధన చేయవలెనో మనకు తెలియదు గాని, ఉచ్చరింప శక్యముకాని మూలుగులతో ఆ ఆత్మ మన పక్షముగా విజ్ఞాపనము చేయుచున్నాడు. మరియు హృదయములను పరిశోధించువాడు ఆత్మయొక్క మనస్సు ఏదో యెరుగును; ఏలయనగా ఆయన దేవుని చిత్త ప్రకారము పరిశుద్ధుల కొరకు విజ్ఞాపనము చేయుచున్నాడు" (రోమా 8:26-27).

అన్ని విషయములను గూర్చి దేవుని ప్రార్థించవచ్చని బైబిలును బట్టి నేనెరుగుదును. దేవుడు నాకు చేసిన మేళ్లను గూర్చి ఆయనను స్తుతింతును, కృతజ్ఞత చెల్లింతును. నా అవుసరములను ఆయనకు తెలియజేతును. దేవుని యొక్క శక్తి జ్ఞానములు అమితములు. ఆయన పరిపూర్ణ ప్రేమతో నన్ను ప్రేమించుచున్నారని నేనెరుగుదును. గనుక అన్ని విషయాల్లో ఆయన చిత్తము నెరవేరునట్లు నేను ప్రార్థించితే, నా ప్రార్థనకు తగిన జవాబు ఆయన అనుగ్రహించును. అది నేననుకొనిన జవాబు కాకపోవచ్చును. అయినను అది శ్రేష్టమైన జవాబు. అందును బట్టి నేను గొప్ప ఆదరణ పొందుదును.

గనుక, "మనలో కార్యసాధకమైన తన శక్తి చొప్పున మనము అడుగు వాటన్నిటిని కంటెను, ఊహించు వాటన్నిటి కంటెను అత్యధికముగా చేయశక్తి గల దేవునికి క్రీస్తు యేసు మూలముగా సంఘములో తర తరములు సదాకాలము మహిమ కలుగును గాక. ఆమేన్" (ఎఫెసీ 3:20-21).

- సుజీ ఫ్రెడరిక్ (IGT)

ఉచితం! ఉచితం! ఉచితం!

మీ ఇంటనే ఉండి బైబిలును చదవండి.
యేసుక్రీస్తును ఆయన బోధనలను తెలుసుకోండి.
మేమిచ్చు ఉచిత బేసిక్ బైబిలు కోర్సులో చేరండి.
పోస్టుద్వారా ఆ పాఠములను పూర్తిచేసి
ఒక బైబిలును ఉచితముగా పొందండి

SATYA VANI, P.O. Box 80, KAKINADA - 533 001. A.P.

# డబ్బు
## ( Money )

నేటి సమాజంలో డబ్బు అత్యంత ప్రాధాన్యమైనది. ఒకడు సంపాదించే దానిని బట్టి అతడు అల్పుడో లేక ఘనుడో ఈలోకం నిర్ణయిస్తుంది. నేటికాలపు వాతావరణం అట్లున్నది. ఒకని ఘనతను డబ్బును బట్టి అంచనా వేయవలసి వస్తే యేసుప్రభువు ఏమంత ఘనుడు కాడు! ఏలయనగా ఆయన పన్ను చెల్లించవలసి వచ్చినపుడు, ఒక చేప నోటిలో నున్న నాణెము నుపయోగించ వలసినదని ఆయన పేతురుకు చెప్పాడు (మత్తయి 17:27). ఎందువలన ? ఆయన దగ్గర ఒక్క చిల్లి గవ్వకూడా లేనందువలన !

క్రీస్తు ఒక పశువుల పాకలో పుట్టాడు. మన బిడ్డలు ఒక మంచి నర్సింగ్ హోమ్‌లో పుట్టకపోతే విభ్రాంతి జెందే రోజులివి. ఆయన చనిపోయినప్పుడు సైనికులు ఆయన అంగీని గూర్చి చీట్లు వేసుకోవలసి వచ్చింది (మత్తయి. 27:35). ఈలోకంలో ఆయనకున్న ఆస్తి అంతా అదొక్కటి మాత్రమే ! కేవలం డబ్బే ప్రధానమైతే క్రీస్తు అల్పుడే. ఏలయనగా, "నక్కలకు బొరియలును ఆకాశ పక్షులకు నివాసములును కలవుగాని మనుష్య కుమారునికి తలవాల్చు కొనుటకైనను స్థలము లేదు" (మత్తయి. 8:20).

డబ్బు సంపాదించడం, దాన్ని పొదుపు చేయడం అవసరం. అది సవ్య మైనదే. అయితే మనం సంపాదించే మొత్తం మాత్రం దేవుని దీవెనల కొలబద్ద కాదు. నీతిమంతుల మీదను అనీతిమంతుల మీదను సూర్యుడుదయించు చున్నాడు (మత్తయి. 5:45). నిజానికి ఈలోకంలో దుష్టులు వర్ధిల్లుటయు దేవుని బిడ్డలు బాధలుపడుటయు జరుగును. ఈ విషయాన్ని గూర్చి బాగుగా ఎరిగి యుండవలసిన క్రైస్తవులు సహితము తాము సంపాదించే డబ్బును బట్టి అల్పులమని లేక ఘనులమని అంచనా వేసికొనడం విచారకరం.

ధనవంతుడు, లాజరుల సందర్భము గుర్తున్నదా ? తన వొళ్ళంతా కురుపులతో నిండియున్న దరిద్రుడు లాజరు. అతడును కుక్కలును

ధనవంతుని బల్లమీదనుండి పడు రొట్టె ముక్కల కొరకు ఎదురుచూచు వారు. చివరకు ధనవంతుడు, లాజరు కూడ చనిపోయారు. లాజరు అబ్రాహాము రొమ్మున ఆనుకొనుటకు కొని పోబడెను. ధనవంతుడు పాతాళములో యాతన పడుచుండెను. అబ్రాహాము అతనిని ఇట్లు గద్దించెను : "కుమారుడా, నీవు నీ జీవితకాలమందు నీ కిష్టమైన సుఖము అనుభవించితివి; ఆలాగుననే లాజరు కష్టము అనుభవించెనని జ్ఞాపక ముంచుకొనుము. ఇప్పుడైతే వాడు ఇక్కడ నెమ్మది పొందుచున్నాడు, నీవు యాతన పడుచున్నావు" (లూకా 16:25). ఒకడు అల్పుడో లేక ఘనుడో నిర్ణయించుటకు డబ్బు మూలము కాదు !

- టామ్ కెల్టన్.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02/99

From :
**SATYA VAKKU**
P.O. BOX 80,
KAKINADA - 533 001.

To

*Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani - Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St., KAKINADA - 533 004. Editor : Joshua Gootam*